క్లుప్తంగా

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీవో కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన పీ 4, కౌశలం, స్వమిత్వ తదితర సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని డీడీవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, పీ 4 సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీ 4 సర్వేపై మండలానికి 10 మంది చొప్పున సచివాలయ సిబ్బందికి ఈ నెల 16న జిల్లా కేంద్రంలో శిక్షణ ఉంటుందని, అక్కడ శిక్షణ పొందిన వారు ఈ నెల 24, 25 తేదీల్లో ఆయా మండల కేంద్రాల్లో మిగతా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శుల ఎంపిక తదితర అంశాలపై ఎప్పటికప్పుడు మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, పీ 4 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

రామభద్రపురం: మండల కేంద్రంలోని బంగారమ్మ తల్లి పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళంతా కళశాలతో ఆలయానికి వెళ్లారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బంగారమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ ఏడాది పాడి పంటలు బాగా పండాలని, ప్రతీ ఒక్కరికీ ఆయురారోగ్యాలు కల్పించాలని తల్లిని మొక్కుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.

గుడ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

రామభద్రపురం: మండలంలోని సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు ఉన్నత పాఠశాలలు, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో కేసులు, బాల్య వివాహాలు కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఆడ పిల్లలకు రక్షణగా 1098 హెల్ప్‌లైన్ నంబర్ వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్.చెంచులక్ష్మి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి : రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు చీడ పీడలు నివారించేందుకు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం ఎల్-2 గౌరీశంకర్ అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ఐసీఆర్‌పీలతో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారాన్ని పండించుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పొదిలాపు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం

రేగిడి : విద్యార్థులు బాల్యం నుంచి మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్ అన్నారు. ఉంగరాడ మెట్ట వద్ద ఏపీ బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, పీఎస్ఎస్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం.రామకృష్ణ, స్టాఫ్‌నర్సు అంజలి, బంగారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు

రేగిడి: అల్ప పీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీవో శ్యామలకుమారి శుక్రవారం సూచించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కాలువల్లో పూడికలు తీయించడం, రోడ్లను పరిశుభ్రం చేయించడం వంటి పనులను చేయించాలని పూడికలు తీసిన అనంతరం బ్లీచింగ్, సున్నం, కాలువల్లో చల్లాలని అన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను ఆరుబయటకు తరలిస్తున్నారు. వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ తదితర గ్రామాల్లో కాలువల్లో పూడికలు తీయించే కార్యక్రమాలు చేపట్టారు.

పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలి

రాజాం : పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలని, సొంతంగా నిధులు సమకూర్చుకునే స్థాయి తెచ్చుకోవాలని పంచాయతీ శాఖ డివిజనల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ హేమసుందరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండలంలో గడిముడిదాం గ్రామాన్ని సందర్శించి, సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్వహణపై ఆరా తీశారు. అంతకుముందు గ్రామంలో చెత్త సేకరణ తనిఖీ చేసి, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. అక్కడి నుంచి పట్టణంలో కొండపేట గ్రామానికి చేరుకుని మన మిత్ర వాట్సప్ గవర్నన్స్ సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- అభివృద్ధి విషయంలో మడత నాలుకలేల?
- బృహత్తర తాగునీటి పథకం నిధులు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..
- అంచనాలు పెంచేందుకే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత
- కూటమి ప్రగల్భాలపై మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిలర్లు

కూటమి నేతలకు.. అభివృద్ధి కనిపించడం లేదా..!

బొబ్బిలి: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేసి చూపించింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే! టీడీపీ కూటమి మాత్రం పనులు చేస్తాం! నిధులు మంజూరు చేస్తాం.. అని ప్రకటనలు గుప్పించేందుకే తప్ప అభివృద్ధి చేసి చూపింది లేదని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. బొబ్బిలి పట్టణానికి బృహత్తర తాగునీటి పథకాన్ని నిర్మించకుండా వైఎస్సార్ సీపీ కాలయాపన చేసిందని ఎమ్మెల్యే బేబీ నాయన, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లతో కలసి పత్రికా సమావేశం నిర్వహించడం హాస్యాస్పదమంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్వీ మురళీ కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ సువర్ణముఖి నది నుంచి పట్టణంలోని 31 వార్డులకు తాగునీరు అందించేందుకు రూ.93.62 కోట్లతో ఏఐఐబీ పథకం ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అప్పటి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అక్టోబర్ 22, 2022న శిలాఫలకం వేసి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్‌కు టెండర్ ద్వారా నిధులు కేటాయించామన్నారు. పట్టణంలోని స్వామివారి వీధి, ఐటీఐ కాలనీ, సంత తోట, పాత వాటర్ ట్యాంకు తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు, అంతర్గత, ప్రధాన పైప్‌లైన్ నిర్మాణాలకు కూడా సబ్ కాంట్రాక్టులు అప్పగించామన్నారు. దీనికి సంబంధించిన నిర్మాణాలు కూడా ప్రారంభించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఒక వేళ మీకు తెలియకపోతే వెళ్లి పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న శిలాఫలకాన్ని కూడా సందర్శించొచ్చన్నారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చొరవతో సువర్ణముఖి నదిలో ఇన్‌ఫిల్టరేషన్ బావి నిర్మాణం కోసం సీతానగరం మండల రెవెన్యూ అధికారులను కూడా సంప్రదించి లొకేషన్ కూడా గుర్తించామన్నారు. స్వామి వారి వీధిలో పైప్‌లైన్ కూడా వేసిన సంగతి తెల్సిందేనన్నారు. ఇంత వ్యవహారం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టించుకోలేదనడం హాస్యాస్పదమన్నారు. అసలు ఈ పథకం నిర్మాణానికి కాలయాపన జరగడానికి కారణం మాజీ మంత్రి, నేటి ఎమ్మెల్యే సోదరుడు సుజయకృష్ణ రంగారావు వల్లనేనన్నారు. గతంలో ఈ పథకానికి నిధులు మంజూరు కాకముందే ఆదరాబాదరాగా శంకుస్థాపన చేసిన విషయం మర్చిపో యారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బృహత్తర తాగునీటి పథకం నిర్మాణం 30 ఏళ్ల వరకూ బొబ్బిలి పట్టణానికి తాగునీటి కొరత లేకుండా రోజూ ప్రజలకు తాగునీరు ఇచ్చేందుకే చేపట్టామన్నారు. అయితే పైప్‌లైన్ నిర్మాణం తదితర అవసరాలకు అధికారులు వేసిన ప్రతిపాదనలు, మంజూరు మధ్య గల సమయం ఎక్కువ అవడం వలన నిధులు చాలవని అధికారులు, కాంట్రాక్టర్, నాయకుల మధ్య చర్చలు జరిగాయి తప్ప వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని నిందించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. రాజా కాలేజ్ రహదారికి సంబంధించి ఎప్పుడు ఎంత స్వంత నిధులు ఖర్చు చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వ నిధులెన్ని? మీ స్వంత నిధులెంత ఖర్చు చేశారో రోడ్డు ఎందుకు ఇంకా ఆ దశలోనే ఉందో ప్రజలకు తెలియజేసి వాస్తవ ప్రపంచంలోకి రావాలని కోరారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ కాలనీలోగానీ, నాయుడు కాలనీలోగానీ ఎన్ని రహదారులు వేశామో మీ వాళ్లనే అడగాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాన రమాదేవి మాట్లాడుతూ ఎక్కడ రహదారికి శంకుస్థాపన చేసినా అప్పటి నాయకులు, స్థానిక ప్రజలు సైతం ఇది తొమ్మిదోసారి, ఇది పదోసారి కొబ్బరి కాయలు కొడుతున్నారనీ, మాకు శంకుస్థాపనలు తప్ప రోడ్లు రావనీ చెబుతున్న మాటలు గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బురదలో కూరగాయలు పండ్లు అమ్ముకునే బజారు రోడ్లు, ఇందిరమ్మ కాలనీ, నాయుడు కాలనీల్లో కోట్లాది రూపాయల రోడ్లు నిర్మించిన విషయం ప్రజలనడిగితే చెబుతారు.. లేదంటే ఆ కాలనీలకు వెళ్లి చూసి రావాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్.రామకృష్ణ, పాలవలస ఉమాశంకర్, కోట పెదరాములు, ఇంటి గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చోడిగంజి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నేరుగా సంప్రదించొచ్చు..



విద్యుత్ వినియోగదారులతో మేము కార్యక్రమంలో మాట్లాడుతూ బొబ్బిలి డివిజన్ ఇంజినీర్ రఘు

మెంటాడ: వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఉంటే నేరుగా అధికారులతో చర్చించి పరిష్కరించుకోవచ్చునని బొబ్బిలి డివిజన్ ఇంజినీర్ రఘు అన్నారు. శుక్రవారం ఇద్దనవలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో ఏఈ రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులతో- మేము అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ రఘు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలుపై అవగాహన పరిచారు. ఏడీ శివకుమార్ మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ పరిధిలో అధిక విద్యుత్ వినియోగం ఉందని అందువల్ల సుదూర ప్రాంతాలకు లో ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయన్నారు. ఆంధ్ర ఫీడర్ 135 కిలోమీటర్లు సుదూర లైన్ ఉందని విద్యుత్ సమస్యలు వస్తుంటాయని, అందుకే రూ.28లక్షలతో అనంతగిరి సబ్ స్టేషన్ నుంచి ఆంధ్ర ఫీడర్ కలుపుతామన్నారు. వైస్ సర్పంచ్ పైడపునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావుతో పాటు సర్పంచ్‌లు, నాయకులు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ రాయితీ

తెర్లాం: ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను సాగు చేసే రైతులకు అందిస్తున్న రాయితీతో మరింత ఎక్కువ విస్తీర్ణంలో ఆ పంటను రైతులు సాగు చేయాలని రామభద్రపురం ఉద్యానశాఖ అధికారి పి.మోహన్‌కృష్ణ అన్నారు. మండలంలోని కుసుమూరు గ్రామంలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను సాగు చేసే రైతులకు రూ.29వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఒక హెక్టార్‌కు ప్రతీ ఏడాది రూ.11,500లు చొప్పున్న మొదటి నాలుగు సంవత్సరాలు సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సాగునీటి వనరులు ఉన్న పెద్ద రైతులు మాత్రమే కాకుండా సన్న, చిన్నకారు రైతులంతా ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ పంటలో రైతులు అంతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో అందుబాటులో వ్యాక్సినేషన్

సాక్షి ఎఫెక్ట్

రాజాం సిటీ: పట్టణ పరిధి ఆదర్శనగర్, బుచ్చెంపేట అర్బన్ పీహెచ్‌సీల్లో రొటీన్ ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని వైద్యాధికారి ఉంగ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. యూపీహెచ్‌సీలో వ్యాక్సినేషన్, ఐఎల్ఆర్ ఫ్రీజర్ల కొరతపై గత నెల 9న 'ప్రజారోగ్యం అంటే లెక్కలేదా' అన్న శీర్షికతో సాక్షిలో ప్రచురించడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు వ్యాక్సినేషన్ భద్రపరిచేందుకు ఐఎల్ఆర్ ఫ్రీజర్లతో పాటు ఇన్వెర్టర్స్, అవసరమైన అన్ని రకాల వ్యాక్సినేషన్లు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారి తెలిపారు. పట్టణంలోని 11 సచివాలయాలకు సంబంధించి గర్భిణులు, అప్పుడే పుట్టిన పిల్లలు, బాలింతలకు ఈ వ్యాక్సిన్లను వేసేందుకు గతంలో పొగిరి పీహెచ్‌సీ నుంచి తరలించేవారని అన్నారు. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తీరాయని, సత్వర సేవలు అందించేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. వైద్యసేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏచూరి పోరాటం

బొబ్బిలి: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధిలోకి వస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలంతా సీతారాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్నూరు మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏచూరి సీతారాం పోరాడారన్నారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఆ బాటలోనే నడుస్తామన్నారు. మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి ట్రంప్ ఆదేశాలను పాటిస్తున్నారని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సభ్యులు యుగంధర్, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు దూరం

- వైద్య, విద్య, రెవెన్యూ శాఖల తీరుపై సభ్యుల మండిపాటు

వంగర: మండల ప్రజలకు వైద్యసేవలు దూరమవుతున్నాయని, పల్లెల్లో ప్రజలకు జ్వరాలు వస్తే పట్టించుకునే నాధుడే కరువయ్యారని సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. తొలుత విద్యా శాఖపై సమీక్ష జరిగింది. తల్లికి వందనం పథకం అర్హులైన లబ్ధిదారులకు అందలేదని, దీనంతటికీ సంబంధిత అధికారులు కారణమని గీతనాపల్లి సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్యతో పాటు సభ్యులు మండిపడ్డారు. అధికంగా భూమి రికార్డుల్లో నమోదైందని, విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని, ఆధార్ నమోదు కాలేదని షాకులతో ఇంత వరకు 194 మంది పేద విద్యార్థులు, వారి తల్లుల ఖాతాకు డబ్బులు జమ కాలేదని ఎంపీపీ సురేష్‌ముఖర్జీ ఎంఈవో మీసాల కూర్మినాయుడును నిలదీశారు. వైద్య శాఖ సమీక్షలో అరసాడ పీహెచ్‌సీ వైద్యులు కలమట ఈశ్వరరావును సభ్యులు నిలదీశారు. జ్వరాలు ప్రబలి రోగులు పట్టణాలకు పరుగులు తీస్తుంటే వైద్యసిబ్బంది కనీసం పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీలు తెంటు కుమారి, కరణం సుదర్శనరావు మండిపడ్డారు. పటువర్ధనం, తలగాం గ్రామాల్లో వ్యాధులు, జ్వరాలతో ప్రజలు మంచం పట్టినా వైద్య తనిఖీలు చేయలేదని, కనీసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదన్నారు. వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉన్నందు వలన రోగులకు సరైన వైద్యం అందడం లేదని సభలో సభ్యులు ధ్వజమెత్తారు. రెవెన్యూ శాఖ సమీక్షలో గ్రామ స్థాయిలో వీఆర్‌వోలు డబ్బులిస్తే తప్ప పనులు చేయడం లేదని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరావు మండిపడ్డారు. రెవెన్యూ వ్యవస్థ వంగర మండలంలో పూర్తిగా నిర్వీర్యం అయిందని సభ్యులు వెల్లడించారు. విద్యుత్ శాఖ సమీక్షలో పిడుగులు వలన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సమయంలో సకాలంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం లేదని, గ్రామాల్లో ప్రతిపాదలు మేరకు కొత్తగా మంజూరైన విద్యుత్ స్తంభాలను ఎప్పుడు అమర్చిడీ చేస్తారో తెలియజేయాలని ఏఈ సాంబశివరావును సభ్యులు ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో మండల రైతులకు సరిపడ యూరియాను మరికొంత ఇండెంట్ ద్వారా తెప్పించాలని ఏవో తట్టికోట కన్నబాబు దృష్టికి తెచ్చారు. కొండచాకరాపల్లి గ్రామాన్ని ఆనుకొని మడ్డువలస ప్రాజెక్టు నీరు నిలువ ఉండడంతో ఇళ్లల్లోకి నత్తలు, జలగలు వస్తున్నాయని, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా పుష్కలంగా సాగునీరు అందించేందుకు పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరుకు ప్రతిపాదించాలని ఏఈ డి.వి.రమణకు తెలిపారు. సమావేశంలో మండల విప్ తెంటు కుమారి, ఎంపీటీసీ కరణం సుదర్శనరావు, ఎంపీడీవో ఎస్.రఘునాధాచారి, డీటీ రుంకాన శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అరసాడ వైద్యాధికారి ఈశ్వరరావును ప్రశ్నిస్తున్న సభ్యులు

యూరియా కోసం రైతుల అగచాట్లు



రాజాం సిటీ: పొగిరి సచివాలయం వద్ద యూరియా కోసం గుమికూడిన రైతులు



బాడంగి: వాడాడ ఆర్ఎస్‌కేవద్ద బారులుతీరిన రైతులు

రాజాం సిటీ: ఖరీఫ్‌లో రైతులకు కష్టాలు వీడడం లేదు. యూరియా కష్టాలు రోజు రోజుకు అధికమౌతున్నాయి. మండల పరిధి పొగిరి రైతు సేవా కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం శుక్రవారం నానాపాట్లు పడ్డారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు సక్రమంగా యూరియా అందించి పంటను కాపాడుకుందామని రైతులు ప్రతి రోజు ఇలా పనులు మానుకుని ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

బాడంగిలో..

బాడంగి: మండలంలోని రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్క యూరియా బస్తా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాస్తూ ఎండానక, వాననక.. క్యూలో బారులు తీరుతూ ఆకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నారు. వాడాడ ఆర్ఎస్‌కే వద్ద యూరియా కోసం రైతులు శుక్రవారం భారీగా క్యూ కట్టారు.


అందరి సహకారంతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ అన్నారు. తెర్లాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, కిశోర్ బాలికల ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలికకు 18ఏళ్లు, బాలునికి 21ఏళ్లు నిండే వరకు వివాహం చేయవద్దన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేసేందుకు ముందుకు వస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. పోక్సో చట్టంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కిశోర్ బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆమె కోరారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలని, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, ఎన్‌జీవో హరీష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పోటీ పరీక్షలకు జీఎంఆర్‌వీఎఫ్ శిక్షణ

రాజాం : రాజాంలోని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ప్రతిభ లైబ్రరీ వద్ద నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల నిమిత్తం కోచింగ్ ఇస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో జీఎంఆర్‌వీఎఫ్ తెలిపింది. అర్థమేటిక్, రీజనింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఈ శిక్షణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోగా సంపత్ భవన్ ఎదురుగా ఉన్న జీఎంఆర్ వీఎఫ్ ప్రతిభ లైబ్రరీలో వివరాలు నమోదు చేసుకోవాలని వెల్లడించారు. ఈ నెల 19 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. మిగిలిన వివరాలకు 99661 98858, 93925 95935 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల ఆగ్రహం




రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



బొబ్బిలి రూరల్: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



రేగిడి: తహసీల్దార్ కృష్ణలతకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



రాజాం సిటీ: తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆయా సంఘాల నేతలు ఆగ్రహిస్తున్నారు. తమ ఆందోళనలో భాగంగా శుక్రవారం పలుచోట్ల వివిధ రూపాల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

రాజాం : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని మండలంలోని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో పలువురు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతీ నెల ఒకటో తేదీనా జీతాలు వేస్తామని కూటమి పాలకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు చేతులెత్తేయడం సబబు కాదని మండిపడ్డారు. జీతాలు లేక తామంతా అప్పులు చేస్తున్నామని, రోజువారీ వడ్డీలు చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలకు సంబంధించి ఇంతవరకూ జీతాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ తాత్సర్యం ఇలానే కొనసాగితే తామంతా రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

బాలికలు హక్కులను తెలుసుకోవాలి

బొబ్బిలి రూరల్: బాలికలు తమ హక్కులను తెలుసుకోవడం ద్వారా అనేక సందర్భాల్లో రక్షింపబడతారని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కె.అనిత సూచించారు. పిరిడి జెడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం బాలికలకు హక్కులు, చట్టాలు వన్‌స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు తదితర అంశాలపై వివరించారు.

సంక్షిప్తంగా...

డ్రోన్లతో పిచికారీ వల్ల మేలు



డ్రోన్‌తో రసాయనాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

బొబ్బిలి రూరల్: వరి, మొక్కజొన్న తదితర పంటలకు రసాయన ఎరువుల పిచికారీకి డ్రోన్లను వినియోగించడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని అగ్రికల్చర్ ఏడీఏ మజ్జి శ్యాంసుందర్ రైతులకు వివరించారు. మెట్టవలస గ్రామంలో శుక్రవారం డ్రోన్ల సహాయంతో పంటలకు రసాయనాలు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, వీఏఏ కె.రామారావు, రైతులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రానికి భవనాన్ని మంజూరు చేయండి

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలోని పశువైద్య కేంద్రానికి భవనాన్ని మంజూరు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ పశువైద్య కేంద్రం పూర్తిగా శిథిలమైయిందని, దీనిలో విధులు భయంగా అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో రాత్రి వేళల్లో పాములు లోపలికి వచ్చేస్తున్నాయన్నారు. శిథిలావస్థలో ఉన్న పశువైద్య కేంద్రానికి భవనం నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వ్యాయామం

రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఆట పాటల విద్యపై కార్యకర్తలు చిన్నారులతో వ్యాయామం చేయించారు. చిన్నారుల ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమని అన్నారు.

పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలి

వంగర: గ్రామాల్లో పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రఘునాథాచారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయాలన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సమిత్వ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

15న బహిరంగ వేలం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, సరస్వతీదేవి అమ్మవారి ఆలయం వద్ద కొబ్బరి చెక్కల వసూళ్లకు ఈ నెల 15న వేలం నిర్వహించనున్నామని ఈవో పి.శ్యామలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో దేవదాయ తనిఖీదారు ఆధ్వర్యంలో ఈ వేలం ఉంటుందని అన్నారు. అధిక ధరకు పాట దక్కించుకున్న వారికి ఈ నెల 16 నుంచి 2027 సెప్టెంబర్ 17వ తేదీ వరకు రెండేళ్ల పాటు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.20వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఎరువులు అధికంగా వాడొద్దు...

రేగిడి: రైతులు వరి పంటకు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడకం చేయవద్దని వ్యవసాయాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని బూరాడ గ్రామంలో ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు నానో డీఏపీ, నానో యూరియా వాడకంతో కలిగే ప్రయోజనాలు శుక్రవారం వివరించారు. అధిక మోతాదులో ఎరువులు వేస్తే పంటలు తెగుళ్లబారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, గులివిందల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

రేగిడి: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. మండల పరిధిలోని పనసలవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు ముగింపులో ఆమె పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, ఈవోపీఆర్‌డీ జగన్నాథరావు, పాఠశాల హెచ్‌ఎం బి.సునీత, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల బీమాపై అవగాహన

బొబ్బిలి: పట్టణంలోని ఓ పాఠశాలలో శుక్రవారం ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)ఆధ్వర్యంలో ఉద్యోగులకు బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఉద్యోగులు బీమా ప్రీమియం గూర్చి చెల్లింపుల నిర్ణీత గడువు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీమా గురించి పొందుపరిచిన కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్ర కుమార్ సాహు, ఏడీ వి.శ్యాంప్రసాద్, ఎస్ఎస్‌వో పి.శ్రీనివాస్, బీఎం జి. జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.